
# ఎర్రగోగుల ఎర్రెమ్మ

డా॥ సి. ఆనందారామం



"ఎర్రగోగుల ఎర్రెమ్మా
వెర్రిబాగుల వీరెమ్మా!"

అని పిల్లలు ఆటపట్టిస్తూ తరుముతోంటే, చిన్నపిల్లలా ఏడుస్తూ, "నేనెర్రిదాన్ని కాను. నేనెర్రిదాన్ని కాను" అంటూ అరుస్తోంది ఎర్రెమ్మ. గొడవకి నేను ఇంట్లోంచి బయటకి వచ్చి పిల్లల్ని అదిలించాను.

"ఏయ్! మీకే వెర్రి. వాళ్ల అన్న యుద్ధంచేసి మనకు స్వాతంత్ర్యం తెస్తే మీరు ఈవిడని ఏడిపిస్తున్నారా? తప్పు" అని అదిలించాను.

"నువ్వు తప్పు చేస్తున్నావు నాయనమ్మా. మనకి యుద్ధం చేస్తే స్వాతంత్ర్యం రాలేదు. అహింసతో- సత్యాగ్రహ సమరంతో వచ్చింది. గాంధీగారు తెచ్చారు." తొమ్మిదో క్లాసులో ఉన్న నా మనుమడు అన్నాడు.

"కాదు, యుద్ధంతో... భయంకర యుద్ధంతో వచ్చింది. ఈ విషయం మీ చరిత్ర పుస్తకాల్లో ఉండదు."

"చరిత్ర పుస్తకాల్లో ఎందుకుండదూ? జరిగినది చరిత్ర పుస్తకాల్లో ఎందుకు రాయరు?" అడిగాడు నా మనుమడు. వాడే ఈ పిల్లగేంగ్‌కు లీడర్."

"బుద్ధిగా కూర్చుంటానంటే చెప్తాను."

పిల్లలు కూచోవడానికి ఒప్పుకున్నారు. నేను మొదట ఎర్రగోగుల ఎర్రెమ్మని సముదాయించి తాగడానికి మజ్జిగ ఇచ్చాను. ఆవిడ తాగి "మా అన్నయ్యొచ్చాక నీకు మంచి చీర పెడతాను" అంది.

"అలాగే" అన్నాను

"అదేమిటి నానమ్మా, ఈవిడ మనకింకా ఎప్పుడో స్వాతంత్ర్యం వస్తుంది అంటుందేమిటి?" అని అడిగాడు నా మనుమడు.

'అది నిజం' అని మనసులో అనుకుని, "జరిగిందంతా చెప్తాను వినండి" అని ఒక కుర్చీలో కూర్చున్నాను. పిల్లలంతా తలో కుర్చీ నా చుట్టూ లాక్కుని కూర్చున్నారు.

***

"అది 1945. అప్పటికి నాకు పదేళ్లు. అయినా, ఆ విషయాలన్నీ గుర్తున్నాయి.

అప్పట్లో అది జమీందారీ గ్రామం. ఇంతగా అభివృద్ధి చెందలేదు. కరెంటూ, కుళాయిలూ ఏమీ లేవు. చెరువులూ, నూతులూ, ఏరులూ- ఇవే నీటికి ఆధారం.

రెండో ప్రపంచ యుద్ధం భయంకరంగా జరుగుతోంది. హిట్లర్, ముసోలినీల ధాటికి మిత్రరాజ్యాలు ఆగలేకపోతున్నాయి. "రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం" అని పిలిచే బ్రిటీష్ సామ్రాజ్యం కుప్పకూలిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు బ్రిటీష్ వాళ్లు, "భారతదేశం కనుక రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారికి సహాయం చేస్తే, బ్రిటీష్‌వారు గెలిచాక భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తాం" అని అన్నారు. జాతీయ నాయకులు అందుకు ఒప్పుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారికి తోడ్పడవలసిందిగా భారతీయ యువకులకు పిలుపు ఇచ్చారు.

యుద్ధం రోజులు సగటు భారతీయులకెంతో దుర్భరంగా ఉండేవి. బియ్యం కోసం, గోధుమ కోసం, కిరోసిన్ కోసం గంటల తరబడి క్యూలలో నిలబడవలసి వచ్చేది. ఏ సరకూ అందుబాటులో ఉండేది కాదు. అన్నీ బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లిపోయేవి. బట్టలు కూడా దొరక్క హెలికాప్టర్లకు కట్టే బట్టను "పేరాచ్యూట్ సిల్క్" అని గొప్పగా జాకెట్లుగా, చొక్కాలుగా కుట్టించుకునేవారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ భాష- విధిగా అన్ని సబ్జెక్టులూ ఇంగ్లీషులోనే చదవాలనే నియమమూ- సగటు విద్యార్థికి పరీక్షలు పాసుకావడం బ్రహ్మప్రళయంగా ఉండేది. మగవాళ్లలోనే డిగ్రీలు తెచ్చుకున్న తెలుగువాళ్లు అతి తక్కువగా ఉండేవాళ్లు. ఆడవాళ్లు ఇద్దరో, ముగ్గురో ఉంటే గొప్ప. ఇంత కష్టపడి పరీక్షలు పాసైనా ఉద్యోగాలు దొరికేవి కావు. దొరికినా, తెల్లవాళ్ల రాజ్యంలో నల్లవాళ్ల జీతాలు అతి తక్కువ. ఎప్పుడూ బాంబు భయమే. వ్యవసాయపు పనులు వెనుకబడ్డాయి. పేపర్ తెరిస్తే విశాఖలోనో, కాకినాడలోనో, బందరు రేవు మీదనో బాంబులు పడ్డాయన్న వార్తలే. ప్రధానంగా ఓడ రేవులమీద ఎక్కువగా పడేవి బాంబులు. బాంబులు వేసేటప్పుడు పడుకోవడానికి వీలుగా గోతులు తవ్వి ఉంచేవారు. పైన విమానం చప్పుడు వినిపించగానే నిలబడవద్దనీ, తవ్వించిన గోతుల్లో పడుకోమనీ హెచ్చరికలు వినిపించేవి.

ఇలాంటి బీభత్స వాతావరణంలో, ఇదే ఊళ్లో వీధి బళ్లో ప్రైమరీ చదువు నేర్చుకున్నాను నేను. ఎర్రెమ్మ కూడా అదే బళ్లో చేరింది. ఇద్దరమూ తోటల్లో తిరిగి ముళ్ల గోరింట పూలు కోసుకున్నాం. బంతిపూలు గొబ్బెమ్మలకు అలంకరించాం. సంజ గొబ్బెమ్మల ముందు పిచ్చి-డాన్సులు చేశాం.

అప్పుడు ఎర్రెమ్మ అన్నయ్య చంటి ఇంట్లోంచి పారిపోయి యుద్ధంలో చేరాడని తెలిసింది. ఏం చేస్తాడు? ఆకలి, తిండి లేదు. కోర్టు బంట్రోతుగా తండ్రి తెచ్చే డబ్బు ఒక్కరికి కూడా సరిగ్గా సరిపోదు. "గోచీకి పెద్ద, అంగవస్త్రానికి చిన్న" అన్నట్లు కూలి పనులకు పోయే కుటుంబాలు కావు. గొడ్లు ఉండేవి కానీ, అమ్మేసుకున్నారు. యుద్ధంలో చేరితే డబ్బులొస్తాయని ఎవరో చెప్పారు. అంతే, తనంతట తానే సోల్జర్‌గా రిజిస్టర్ చేయించుకుని సైన్యంలో చేరిపోయాడు. ఎర్రెమ్మ ఎంతో ఏడ్చింది. తల్లి బెంగతో మంచం పట్టింది. తండ్రి ఏం చెయ్యాలో తోచక మళ్లీ బ్రిటీష్ వాళ్ల కోర్టుకే బంట్రోతుగా వెళ్లాడు.

ఎర్రెమ్మ బడి మానేసింది. ఇంట్లో పనంతా అదే చెయ్యాలి. దానితో, "ఎలాగైనా చదువుకో" అని చెప్పేటంత జ్ఞానం నాకు ఆనాడు లేదు. నేనే మా అమ్మ భయానికి చదువుకొనేదానిని.

మూడు నెలలు గడిచాయి. చంటి తిరిగి వచ్చాడు. ఎర్రెమ్మ సంతోషించింది. కానీ, ఆ సంతోషం భయంగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. చంటి యుద్ధంలోంచి పారిపోయి వచ్చాడు. అలా పారిపోయి వచ్చిన వాళ్లని మిలటరీ పోలీసులు పట్టుకు పోతారనీ, "కోర్టు మార్షల్" విధిస్తారనీ నాన్నగారు చెప్పారు.

నాన్నగారు చంటితో మాట్లాడి వచ్చారు.

"ఏం జరిగింది నాన్నగారూ" అని అడిగాను.

"అక్కడ మన భారతీయులకు చాలా అన్యాయం జరిగిపోతోందమ్మా." బాధగా అన్నారు నాన్నగారు.

ఏం జరిగిందో వివరంగా చెప్పమని అమ్మ కూడా అడిగింది. నాన్నగారు మొదలుపెట్టారు.

***

సైన్యంలో చేరినప్పటినుంచీ చంటికి ప్రతి క్షణమూ, ఒక నరకమే అయింది. మిలటరీ క్రమశిక్షణ చాలా కఠినంగా ఉంటుంది. అందులోనూ భారతీయులంటే చిన్న చూపు. ఏ తిండికి ఆశపడి సైన్యంలో చేరాడో ఆ తిండి కూడా లేదు. ఉలవ పప్పూ, ఉలవచారూ, రొట్టెలూ పెట్టేవారట. ఆ తిండి వీడికి అలవాటు లేక వాంతులైతే మందు ఇప్పించకపోగా తిట్టేవారట. నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టేవారట. మాట వినకపోతే బూట్ కాలితో తన్నేవారట. నల్లవాళ్లూ, తెల్లవాళ్లూ, అందరూ సైనికులే అయినా, ఒక స్థావరం నుంచి మరో స్థావరానికి మారేటప్పుడు తెల్లవాళ్ల సామానంతా నల్లవాళ్లతో మోయించేవారట. ఏనాడూ ఏ సందర్భంలోనూ వాళ్లతో సమంగా చూడకపోగా హీనంగా, అవమానకరంగా చూసేవాళ్లట. తిండి లేకపోవడం కంటే ఈ అవమానకరమైన ప్రవర్తన చంటి భరించలేకపోయాడు. ఒకసారి ఎదురు తిరిగాడు. అంతే, ఒళ్లంతా హూనమయ్యేలా దెబ్బలు. "నీ చెల్లెల్ని నా దగ్గరకి పంపు" లాంటి బండతిట్లూ... వీడికి ఇంగ్లీషు రాదు. దుబాసీ ఒకడు ఈ తిట్లన్నీ కూడా తెలుగులోకి అనువదించి చెప్పేవాడు. చంటి ముఖం నిస్సహాయమైన రోషంతో రగిలిపోతుంటే, ఆ తెల్లవాడు వెటకారంగా నవ్వేవాడు. వచ్చిపుండులా ఉన్న ఒంటితోటే,



## మేలు చేసే అవిసెగింజలు

అవిసెగింజలను 'ఫ్లాక్స్ సీడ్స్' అంటారు. ఆహారంలో అవిసెగింజలను చేర్చుకోవటం వల్ల గుండెకు మేలు జరుగుతుంది. కాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ఆహారంలో తగిన పోషకాలు లేకపోతే ఆ లోటును ఈ గింజలు పూరిస్తాయి. వీటిని బాగా వేయించి సోంఫ్ గింజల్లో కలుపుకుని మౌత్ (ఫ్రెషనర్స్‌గా వాడుకోవచ్చు. రాత్రంతా నీటిలో నానబెట్టి వుంచి ఉదయమే బ్రేక్ ఫాస్ట్‌గా తీసుకోవచ్చు. చట్నీ చేసి భోజనంలో తీసుకోవచ్చు.

### గమనిక

జూలై 4, 2003వ తేదీ ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ఆదివిష్ణు విరామకథ 'రేవటి మనిషి' 1967 జూలైలో 'భారతి' సాహిత్య మాసపత్రికలో మొదటిసారి ప్రచురితమైంది.

తన సామానులూ, తెల్లవాడి సామానులూ మోయవలసి వచ్చేదట.

"ఇంతకంటే చావడం మేలు" అని ఎన్నోసార్లు అనిపించేదట. ఇలా రోజు రోజూ చుట్టూ ఎన్నో చావులు చూస్తూ యుద్ధం చేసేవాడట. తుపాకీ పట్టుకోగానే "ఎవరిని చంపుతున్నాను, ఎందుకు చంపుతున్నాను" అనిపించేదట. ఏమీ తెలీకుండా తిండి కోసం యుద్ధంలో చేరాడు. చాలామంది అలాగే చేరారు. ఇదంతా "దేశభక్తి" అని అతను ఎలా అనుకోగలడు? అతనిని "దేశభక్తుని" లాగా ఎవరు చూశారు? ఒక దొంగని చూసినట్లు, ఒక ఖైదీని చూసినట్లు, ఒక మహా పాతకుడిని చూసినట్లు చూస్తున్నారు.

ఒకసారి వాళ్ల స్థావరం మీద బాంబులు పడ్డాయి. బ్రిటీష్ సైనికులు అతి త్వరగా రక్షిత స్థానాలకు చేరుకోగలిగారు. నల్ల సైనికులు బాంబులకు ఎరగా మిగిలిపోయారు. చంటి శవాలను తన మీద గుట్టగా వేసుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. కానీ, తెలివి తప్పిపోయాడు.

తెలివి వచ్చేసరికి స్థావరాలకు దూరంగా శవాల గుట్టల మధ్య ఉన్నాడు. మొదట భయం వేసింది. తర్వాత ఏం జరిగిందో తెలిసింది. బాంబుల వర్షం వెలిశాక, మిగిలిన సైనికులు శవాలనన్నింటినీ దూరంగా కుప్పగా పేర్చారు. తర్వాత డాక్టర్ పరీక్ష జరుగుతుంది. అదృష్టవంతుడెవరైనా బతికి ఉంటే, హాస్పిటల్లో చేరుస్తారు. లేదా చచ్చిపోయిన వాళ్ల జాబితా రేడియోలో వినిపిస్తారు. వార్తాపత్రికల్లో ప్రచురిస్తారు. శవాల గుట్టల మధ్య నుంచి లేచిన చంటికి మళ్లీ స్థావరాలలోకి వెళ్లాలనిపించలేదు. సైన్యంలోకి చేరాక మొదటిసారిగా నిఘా లేకుండా ఉన్నాడు. లేచి పారిపోయాడు. ఎలాగో కష్టపడి రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. మిలటరీ యూనిఫాంలో ఉన్నాడు గనుక టికెట్ లేకుండా ప్రయాణం చేయగలిగాడు. ఇంటికి చేరుకున్నాడు. పాపం చంటికి తెలియనిదొక్కటే. సైన్యంలో ఒక్కరి పేరు కూడా గల్లంతు కావడానికి వీల్లేదు. శత్రు గూఢచారిగా మారతారేమోననే భయంతో ఎప్పుడూ ఎంతో జాగ్రత్తగా ఉంటారు. మరణించిన వారి జాబితాలో చంటి పేరు లేకపోవడం గమనించి అతని కోసం గాలింపు ప్రారంభించారు. చంటి సులభంగానే దొరికిపోయాడు..." కొన్ని క్షణాలు అందరి మధ్యా నిశ్శబ్దం నిండింది.

"ఇప్పుడు చంటినేం చేస్తారు?" అడిగాను.

"పడుకో, మళ్లీ ఎప్పుడో వస్తాడులే" అన్నారు నాన్నగారు. కానీ, ఆయన కళ్లలో తడి నాకు కనిపించింది.



## నటుడైన దర్శకుడు

బాలీవుడ్‌లో మంచి చిత్రాలు తీసి పేరు సంపాదించుకున్న దర్శకుడు మహేశ్ మాంజ్రేకర్. 'కాంటే' చిత్రంలో పెద్దనటులైన అమితాభ్ బచ్చన్, సునీల్ శెట్టి, సంజయ్ దత్, గాయకుడు లక్కీ అలీ, బంటీ వంటి వారితో కలిసి నటించాడు. అంతే కాదు, తను చేసిన పాత్రకు అవార్డు సైతం కొట్టేశాడు. బోనీకపూర్ తన 'రన్' చిత్రంలో చేయమని 'కాంటే' కన్నా ముందు అడిగితే అంగీకరించాడు. అటు తరువాత బోనీయే తన తరువాతి చిత్రం 'ముసాఫిర్'లో మహేశ్‌కు సరిపోయే పాత్రొకటి వుందనీ, అతను తప్ప మరొకరు చేయలేరనీ బలవంతపెడితే సరేనన్నాట్ట. అటు వారిటు కావటంలో బాలీవుడ్‌దే ముందడుగు!

"సింగపూర్‌లో కూడా భారతీయ సైనికుల్ని జర్మనీ వారికి వదిలి, బ్రిటీష్ సైనికులు తప్పించుకున్నారనీ, అందుకు గాంధీకి కోపం వస్తే, ఇకముందు ఇలాంటివి జరగకుండా జాగ్రత్తపడతామనీ బ్రిటీష్ వారు మాట ఇచ్చారనీ పేపర్లో చదివాను" అంది అమ్మ.

"అప్పుడు ఆ మాటల్లోని ఘోరం నాకు అర్థం కాలేదు కానీ, మీరే ఊహించండి. మనం ఎవరికోసం పోట్లాడుతున్నామో, వాళ్లు తప్పించుకొంటే, మనవాళ్లు మాత్రం జర్మనీ వాళ్లకు బందీలుగా అండమాన్స్‌లో దారుణమైన శిక్షలు అనుభవిస్తున్నారంటే ఇది ఎంత అమానుషమైన విషయం?"

***

పిల్లలందరికీ కళ్లు చెమ్మగిల్లాయి. భాను ఏడ్చేస్తోంది. "చంటిని ఏం చేశారు నాయనమ్మా?" నా మనుమడు అడిగాడు.

"కోర్టు మార్షల్ విధించి కాల్చి చంపేశారని విన్నాను. ఇలాంటి నేరాలకు అదే శిక్ష అట. యుద్ధ రహస్యాలు సైనికులకి తెలుస్తాయి కదా. అందుకని వాళ్లు అనుమతి లేకుండా స్థావరం విడిచి వెళ్లకూడదు."

"ఎర్రెమ్మ ఎందుకిలా అయిపోయింది?"

"నాకు చెప్పినట్లే తనకీ మీ అన్నయ్య త్వరలో వస్తాడు" అని చెప్పి ఉంటారు. తాను నమ్మేసి ఉంటుంది. ఎర్రెమ్మ తల్లి చచ్చిపోయింది. తండ్రి కూడా పోయాడు. పెద్దన్న ఎవరో ఆమెను ఒక ముసలాడికి పెళ్లి పేరుతో బానిసగా పంపాడని విన్నాను. తర్వాత నేను పై చదువులకి వెళ్లిపోయాను. పెళ్లయింది. కొన్ని సంవత్సరాల తర్వాత పిల్లలతో ఈ ఊరు చూద్దామని వస్తే, ఎర్రెమ్మ ఇలా కనబడింది. ముసలి మొగుడుపోయాడు. పుట్టింటి వాళ్లు ఎవరూ మిగలలేదు. అత్తింటివాళ్లు తరిమేశారు. ఇలా అయిపోయింది. ఇప్పటికీ తన అన్న బతికే ఉన్నాడనీ, దేశానికి స్వాతంత్ర్యం వస్తే అన్న తిరిగొస్తాడని నమ్ముతోంది. ఈ ఊహే దాని ఉనికికి ఆధారం. ఇంకెప్పుడూ ఎర్రెమ్మని ఏమీ అనకండి. మనం గౌరవించవలసిన వ్యక్తులెవరైనా మిగిలి ఉంటే, వాళ్లలో ఎర్రెమ్మ ఒకరు."

పిల్లలంతా ఎర్రెమ్మకు నమస్కారాలు చేశారు. ఆవిడ దేశమాతలాగ 'వెర్రి నవ్వు' నవ్వింది.

"నువ్వు చెప్పిందే నిజం నాయనమ్మా! ఆ రోజుల్లో చంటిలాంటి భారతీయులెందరో రెండో ప్రపంచ యుద్ధంలో బలికాకపోతే, మనకు స్వాతంత్ర్యం వచ్చేదే కాదు." జ్ఞానోదయమైన వాడిలా అన్నాడు నా మనుమడు.

ఆ మరునాడే హైదరాబాదుకి మా ప్రయాణం. చీరా, రవికా, పళ్లూ తెప్పించి ఎర్రెమ్మకిచ్చాను.

"మా అన్నయ్య వచ్చాక నీకింతకంటే మంచి చీరపెడ్తాను." గంపంత ముఖంతో అంది ఎర్రెమ్మ.

చింపిరి జుట్టుతో, మాసిన చీరతో, ముడుతలు పడ్డ ముఖంతో, వణుకుతున్న ఒంటితో ఉన్న 'ఎర్రెమ్మను నేను ఆప్యాయంగా కౌగలించుకుంటే, నా మనుమలు ఆశ్చర్యంగా చూశారు.'

***(ఈ కథ 9 డిసెంబరు 1997 'ఇండియా టుడే'లో మొదటిసారి ప్రచురితమైంది)***